
సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం । 1 । జూలై । 2024



బంక్ యజమానుల దాడి

డీజిల్ పోసుకుని ఇచ్చిన రూ.500నోటు చెల్లదని నెలకొన్న వివాదంలో ఓ వినియోగదారుడిపై పెట్రోల్ బంక్ యజమానులు దాడి చేశారు. - 8లో▸



వైద్యుడు.. కనిపించే దేవుడు

వైద్యుడు దేవుడితో సమానం. రోగికి ప్రాణం పోసి నిండు జీవితం ప్రసాదిస్తాడు. నేడు జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$35^0 / 25^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై రాత్రిపూట పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాళేశ్వరంలో పూజలు



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వరముక్తీశ్వర స్వామిని కరీంనగర్ ఎలక్షన్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్ అశ్విని కుమార్ పాండే దర్శించుకున్నారు. ఆదివారం ఆయన ఆలయ రాజగోపురం వద్దకు రాగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి గర్భగుడిలో అభిషేకం, అమ్మవారి ఆలయంలో దర్శనం చేశారు. ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ స్వామివారి శేష వస్త్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో భూ సమస్యల పరిష్కారాల్లో ధరణిలో ఏ మాడ్యుల్‌పై ప్రజలు దరఖాస్తు చేయాలనే అంశంపై తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ల్లో, మీ సేవ కేంద్రాల్లో ప్రజలకు తెలిసే విధంగా స్పష్టంగా తెలుగులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండలస్థాయిలో దరఖాస్తు పరిష్కారం కానీ పక్షంలో మాత్రమే కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి రావాలన్నారు. పరిపాలన ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని అధికారులు నిర్దేశించిన సమయానికి హాజరుకావాలని సూచించారు.

అంతర్రాష్ట్ర వంతెన వద్ద పోలీసుల తనిఖీలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద ఎస్సై బి.చక్రపాణి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆదివారం తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వచ్చిపోయే వాహనాలను నిలిపి క్షుణ్ణంగా సోదాలు చేశారు. అనుమానితులను విచారించి వదిలేశారు. వారి వివరాలు తీసుకున్నారు. వాహన ధృవీకరణ పత్రాలు లేనివారికి జరిమాన వేశారు. ఆయన వెంట టీఎస్ఎస్‌పీ పోలీసులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రం మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. భూపాలపల్లికి చెందిన పొన్న శ్రీనివాస్, పొన్న రాజేష్ ఓమిని వాహనంలో అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు మహదేవపూర్ మండలకేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



వెంకటాపురం(కె): ఓడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన డర్రా దామోదర్‌ను ఆదివారం మండల పరిధిలోని వీఆర్‌కే పురంలో ఆ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన దామోదర్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకుల వాదం నర్సింహరావు, సను గొండ వెంకన్న, కొప్పుల మల్లయ్య, పోతురాజు, రాము, కల్యాణ్, వినోద్, రవి చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్

విద్యకు నిలయం కాటారం

- సాంకేతిక, ఉన్నత విద్య కళాశాలలు
- విరివిగా గురుకులాలు, కళాశాలలు
- అందుబాటులో వృత్తి విద్యాకోర్సులు

కాటారం: జిల్లాకేంద్రానికి సాటిగా కాటారం మండలం ఓ గొప్ప ఎడ్యుకేషన్ హబ్‌గా కొనసాగుతోంది. మండలంలో ఐదు గురుకుల పాఠశాలతో పాటు మాధ్యమిక విద్య, సాంకేతిక విద్యా కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల అప్‌గ్రేడ్ కళాశాల, మోడల్ కళాశాల ఉన్నాయి. మండలానికి చెందిన విద్యార్థులే కాకుండా జిల్లాలోని వివిధ మండలాల, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కాటారంలో వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో..

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా కాటారం మండలంలో పలు ఉన్నత, సాంకేతిక విద్యాసంస్థలు ఏర్పాటు చేశారు. అప్పటి ఉన్నత విద్యాశాఖ మంత్రి, ప్రస్తుత ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో మండలంలో పాలిటెక్నిక్ కళాశాల, పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ), ప్రభుత్వ జూనియర్ కళాశాల, గంగారం మోడల్ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలు ఏర్పాటయ్యాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని యువతకు వృత్తి విద్యను అందించడం కోసం రూ.2కోట్ల నిధులతో యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ) ఏర్పాటు జరిగింది. ఇవే కాకుండా కాటారం, గంగారంలో బాలికల వసతి గృహాల ఏర్పాటు సైతం జరిగింది.

కోట్లాది రూపాయలతో పక్కా భవనాలు..

గత కొన్ని సంవత్సరాల పాటు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కాటారం మండలకేంద్రంలో కొనసాగగా మండలంలోని కొత్తపల్లి సమీపంలో రూ.8 కోట్ల నిధులతో సరికొత్త హంగులతో పక్కా భవన ఏర్పాటు జరగగా ప్రస్తుతం అక్కడే కళాశాల కొనసాగుతోంది. రూ.4కోట్లతో విద్యార్థుల కోసం హాస్టల్ భవనం నిర్మించగా.. కొన్ని రోజుల క్రితం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. రూ.40లక్షల ఐఏపీ నిధులతో నిర్మించిన భవనంలో ఐటీఐ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. భవనం ఆధునీకరణ కోసం మంత్రి శ్రీధర్‌బాబు ప్రభుత్వం మరిన్ని నిధులు మంజూరు చేయించారు. గంగారం మోడల్ పాఠశాల, వసతిగృహం భవనాలు సుమారు రూ.3 కోట్లు, రూ.1.20 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, సుమారు రూ.55 లక్షలతో కాటారం మండల కేంద్రంలో ఎస్సీ బాలికల వసతి గృహం, రూ.80లక్షలతో గంగారంలో ఎస్సీ బాలికల వసతి గృహానికి పక్కా భవనాలు నిర్మించారు.

స్వరాష్ట్రంలో మరిన్ని విద్యాసంస్థలు..

ఉమ్మడి రాష్ట్రంలో మండలంలో సాంకేతిక, ఉన్నత విద్యా కళాశాలలు, పాఠశాలల ఏర్పాటు జరగగా స్వరాష్ట్ర ఏర్పాటు అనంతరం మండలానికి మరిన్ని ప్రభుత్వ విద్యాసంస్థలు మంజూరయ్యాయి. గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఉచిత కేజీ టూ పీజీ నిర్బంధ విద్య కార్యక్రమంలో భాగంగా మండలంలో గురుకులాల సంఖ్య పెరిగిపోయింది. మండలంలో ఎస్సీ బాలికల, గిరిజన బాలికల, బీసీ బాలుర గురుకులాలు మంజూరయ్యాయి. మండల కేంద్రంలో సుమారు రూ.4కోట్లతో ఎస్టీ బాలికల కోసం గురుకుల భవనాన్ని నిర్మించారు. దామెరకుంటలో రూ.1.20కోట్లతో నిర్మించిన భవనంలో సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల కొనసాగుతుంది. మండలకేంద్రానికి మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులం మంజూరయినప్పటికీ సరైన సౌకర్యాలు లేకపోవడంతో పెద్దపల్లి జిల్లా మంథని మండలం వెంకటాపూర్‌లో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు.

గురుకులాలు కళాశాలలుగా అప్‌గ్రేడ్..

మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నప్పటికీ గిరిజన బాలుర, బాలికల పాఠశాలలు సైతం కళాశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. దీంతో వందలాది మంది విద్యార్థులకు ఇంటర్ విద్య అందుబాటులోకి వచ్చింది. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మోడల్ పాఠశాలలు కూడా ఇంటర్ కళాశాలలుగా మారడంతో విద్యార్థులు ఇంటర్ విద్యకోసం మరో ప్రాంతానికి వెళ్లాల్సిన పరిస్థితి దూరమైంది.

వేలాది మంది విద్యార్థులకు బోధన..

మండలంలో సాంకేతిక, ఉన్నత విద్యా కళాశాలలు, గురుకుల విద్యాలయాల ఏర్పాటు జరగడంతో వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఒకప్పుడు పదోతరగతి పూర్తికాగానే ఉన్నత విద్య కోసం వెళ్లడానికి మారుమూల గ్రామీణ విద్యార్థులకు ఆర్థిక భారం ఉండేది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చదువు మాన్పించేవారు. ఇప్పుడు విద్యార్థులు అర్ధాంతరంగా చదువులు నిలుపుకొనే పరిస్థితి లేకుండా పోయింది. విద్యార్థులు ఎలాంటి ఆర్థికభారం లేకుండా దూరప్రాంతాలకు వెళ్లకుండా ఇష్టమైన విద్య ఫలాలను అందుకొనే వెసులుబాటు ప్రభుత్వాలు కల్పించాయి. పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులు, ఐటీఐలో పలు ట్రేడ్‌లలో విద్యార్థులు చదువుతున్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల్లో చదివి, శిక్షణ పొందిన విద్యార్థులు ప్రస్తుతం పలు ఉపాధి, ఉద్యోగ రంగాల్లో రాణిస్తూ కాటారానికి గొప్ప పేరు తీసుకొస్తున్నారు.



కాటారంలో గిరిజన బాలికల అప్‌గ్రేడ్ కళాశాల భవనం

ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య

దామెరకుంట సోషల్ వెల్ఫేర్ బాలికల అప్‌గ్రేడ్ కళాశాల	640
గిరిజన బాలుర సంక్షేమ గురుకుల అప్‌గ్రేడ్ కళాశాల	640
గిరిజన బాలికల సంక్షేమ గురుకుల అప్‌గ్రేడ్ కళాశాల	600
కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల	250
గంగారం మోడల్ పాఠశాల, కళాశాల	425
ప్రభుత్వ జూనియర్ కళాశాల	100
మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల	310
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల	360
ప్రభుత్వ ఐటీఐ కళాశాల	65



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన



ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నాం. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం కోసం ప్రభుత్వ కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకొని పూర్తిస్థాయి సౌకర్యాలు ఉంటాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివించి ప్రభుత్వ ఆశయానికి సహకరించాలి.

– లక్ష్మణ్, అకడమిక్ మానిటరింగ్ అధికారి

నేటినుంచి అమల్లోకి కొత్త చట్టాలు

ఎస్పీ కిరణ్‌ఖరే



ముగింపు శిక్షణ అవగాహన సదస్సులో పోలీస్ సిబ్బందితో ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి: నేటి (సోమవారం) నుంచి నేర న్యాయచట్టాలు–2023 అమల్లోకి రానున్నట్లు ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. నూతన చట్టాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులకు, సిబ్బందికి నెల రోజుల పాటు శిక్షణ, అవగాహనపై ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఎస్పీ పాల్గొని మాట్లాడారు. నూతన చట్టాల నిర్వహణతో పాటు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అమల్లోకి రానున్న కొత్తచట్టాలు దేశ అంతర్గత భద్రతతో నూతన శకాన్ని ప్రారంభించనున్నాయని తెలియజేశారు. ఈ చట్టాల ద్వారా కేసుల దర్యాప్తులో వేగం, బాధితులకు సత్వర న్యాయం లభిస్తాయని పేర్కొన్నారు. ఈ నూతన చట్టాల ద్వారా దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతులలో మార్పు వస్తుందన్నారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించే అవకాశం ఉంటుందని స్పష్టంచేశారు. న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని, అవసరాన్ని బట్టి ప్రజాభద్రత కోసం ఎన్నో చట్టాల రూపకల్పన జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎస్పీ నారాయణ నాయక్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, రత్నం, ఎస్సైలు పాల్గొన్నారు.

లక్ష సంతకాల ఉద్యమం

వెంకటాపురం(కె): నేతకాని కులస్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివాసం లక్ష సంతకాల ఉద్యమాన్ని నేతకానీల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడీ ఈశ్వర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతకాని కులస్తుల సమస్యలపై సీఎం, రాష్ట్ర పతి, ప్రధా న మంత్రికి లక్ష సంతకాల పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి పాత్ర చిరస్మరణీయం

కాటారం: ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర చిరస్మరణీయంగా మిగిలిపోతుందని గురుకులం రీజినల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి అన్నారు. కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ జె.కె.బుచ్చయ్య పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం కళాశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. బుచ్చయ్య శోభారాణి దంపతులను ఆర్‌సీఓ, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. గురుకులంలో బుచ్చయ్య అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఉద్యోగ నిర్వహణలో ఆయన చేసిన సేవలు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తాయన్నారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ వృత్తి చాలా కష్టతరంతో కూడుకున్నదని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్ దిశానిర్దేశం చేయడంలో కీలకంగా ఉంటుందన్నారు. పదవీ విరమణ పొందినప్పటికీ వ్యక్తిగతంగా బుచ్చయ్య తన అనుభవాలను గురుకులానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజేందర్, దామరవంచ, ములుగు ప్రిన్సిపాళ్లు ముత్తయ్య, నారాయణనాయక్, కుమార్, పీడీలు వెంకటేశ్వర్లు, వెంకటేష్, రమణ, మంథెన శ్రీనివాస్, గురుకులం యూనియన్ నాయకుడు కమలాకర్, ట్రైట యూనియన్ నాయకుడు సిరిసిల్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బుచ్చయ్య దంపతులను సన్మానిస్తున్న ఆర్‌సీఓ, అధ్యాపకులు

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్ రెడ్డి

గోవిందరావుపేట: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం మండల కమిటీ సమావేశం గుండు రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ వరకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిందన్నారు. ఈ రుణమాఫీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ యోజన పథకంలోని గైడ్‌లైన్స్ ఆధారంగా అమలు చేయడం వల్ల ధరణి పట్టాదారులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. దీంతో ఏజెన్సీలో అనేక మంది రైతులు రుణమాఫీ వర్తించక నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఏజెన్సీలోని మీ సేవ పహాణీల ద్వారా రైతులు బ్యాంకులలో రుణాలు తీసుకున్నారని వారికి కూడా రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు ఏజెన్సీ ఏరియాలలో ఈ సమస్య ఉన్నదని తెలిపారు. కావున ఏజెన్సీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బ్యాంకులలో వ్యవసాయం పేరుతో తీసుకున్న అన్ని రకాల అప్పులను అర్హులైన రైతులందరికీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు తీగల ఆదిరెడ్డి, సామ చంద్రారెడ్డి, కన్నోజు సదానందం, ఖ్యాతం సూర్యనారాయణ, సప్పిడి ఆదిరెడ్డి, కాప కోటేశ్వరరావు, మారబోయిన సారయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు, రాజనీతి శాస్త్రం, కంప్యూటర్స్ అప్లికేషన్స్ సబ్జెక్టులలో బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో జనరల్ కేటగిరి వారికి, ఓబీసీ కేటగిరి వారికి 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం మార్కులు సాధించినవారు అర్హులని పేర్కొన్నారు. జూలై 2వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని, ఎంపిక కోసం ఇంటర్వ్యూ, డెమో క్లాస్ నిర్వహించబడుతుందని వివరించారు. ఇంటర్వ్యూ, డెమో తేదీలు అభ్యర్థులకు ఫోన్ల ద్వారా తెలియజేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు సెల్ నంబర్ 9866560840లో సంప్రదించాలని తెలిపారు.

అంబేడ్కర్ నేటితరానికి ఆదర్శం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచన విధానం నేటితరానికి ఆదర్శప్రాయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. వెంకట్రావ్‌పల్లి మాజీ సర్పంచ్ ఏకు మల్లేష్ జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం మల్లేష్ తనయుడు లావణ్య హాస్పిటల్ అధినేత డాక్టర్ నవీన్ ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే గండ్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. బాల్యం నుంచి వివక్షను ఎదుర్కొంటూనే దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రూపొందించే స్థాయికి ఎదిగిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు పొలాల సరోత్తమ్‌రెడ్డి, సంగి రవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



టేకుమట్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ధ్యాన కేంద్రం ప్రారంభం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని మంజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ధ్యాన మందిరాన్ని ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి హాజరై పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ధ్యానకేంద్రం నిర్వాహకులు ఎమ్మెల్యే సత్యనారాయణరావుతో పాటు కీర్తిరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ధ్యానానికి మించిన సంపదలేదు..

ధ్యానానికి మించిన సంపదలేదని, నిత్యం ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రజలకు ధ్యానం అందించడంతో పాటు శాకాహార సమాజ నిర్మాణానికి పత్రీజీ చేస్తున్న కృషి అభినందనీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం ధ్యాన మహాసభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ధ్యాన సొసైటీ సభ్యులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు ఉన్నారు.



భూపాలపల్లి రూరల్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కీర్తిరెడ్డి

అనధికార రేషనలైజేషన్ సరికాదు

ములుగు: ఎస్జీటీలకు నిన్నటి వరకు జిల్లా విద్యాశాఖాధికారులు చూపించిన ఖాళీలను అనధికార రేషనలైజేషన్ చేసి మూసివేయడం సరికాదని విద్యాశాఖ అధికారులు తక్షణమే ఆ విధానాన్ని మానుకోవాలని ఎస్టీయూ ములుగు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిరుప సతీష్ కుమార్, ఏళ్ల మధుసూదన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకవైపు సీఎం మూతబడిన పాఠశాలలను తెరిపించాలని ఆదేశాలిస్తే, జిల్లాలో మాత్రం ఖాళీలను చూపకుండా ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుండడం బాధాకరమని తెలిపారు. ఇప్పటికైనా ఎస్జీటీ బదిలీల కౌన్సెలింగ్‌లో జిల్లాల్లో ఉన్న ఖాళీలన్నింటిని చూపిస్తూ జాబితాలను విడుదల చేయాలని, సోమవారం సాయంత్రం వరకు ఆప్షన్స్ ఇచ్చుకోవడానికి లింక్ సమయాన్ని పొడిగించాలని కోరారు. ఇదే షెడ్యూల్లో ఒకటి కంటే ఎక్కువ పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల ద్వారా ఏర్పడిన ఖాళీలను కూడా అర్హత కలిగిన సీనియర్ ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతుల అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇసుక క్వారీలో నిరీక్షణ



లారీలు లోడింగ్ కాక ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లు

- నాలుగు రోజులుగా లోడింగ్ నిలిపేసిన నిర్వాహకులు
- ఇబ్బందులు పడుతున్న లారీ డ్రైవర్లు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఏటూరునాగారం ఇసుక క్వారీలో నాలుగు రోజులుగా 30 లారీలకు చెందిన డ్రైవర్లు నిరీక్షిస్తున్నారు. జంపన్నవాగు ఇసుక క్వారీకి వచ్చిపోయే దారితో ఎలాంటి ఇబ్బంది లేకున్నప్పటికీ లోడింగ్ నిలిపివేశారు. ఇసుక క్వారీలో లోడింగ్ చేయిస్తామని చెప్పి ఇసుక రీచ్ నిర్వాహకులు ఖలీద్, తదితరులు ఒక్కో లారీ వద్ద రూ. 5వేలు నగదు తీసుకొని లోడింగ్ చేయకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని డ్రైవర్లు బషీర్ తదితరులు వాపోయారు. తమకు ఆహారం, తాగునీరు కూడా లేదని, నాలుగు రోజుల నుంచి ఇక్కడే ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వాగులోనే రాత్రి, పగలు పడిగాపులు కాస్తున్నామని వాపోయారు. కలెక్టర్, ఎస్పీ స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. కావాలనే తమ వద్ద డబ్బులు తీసుకొని లోడింగ్ చేయకుండా నిర్వాహకులు వేధిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు.


డాక్టర్స్ డే ✚ శుభాకాంక్షలు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


దస్రూ మృతదేహం


గూడూరు: అప్పుల బాధతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మచ్చర్లలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గులోతు దస్రూ (55) కుటుంబ ఖర్చుల కోసం అప్పు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలని భార్య ఆగమ్మతో తరుచూ చెబుతూ మనస్తాపం చెందేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పురుగుల మందు డబ్బాతో నిద్రించగా గుర్తించిన భార్య ఆగమ్మ కేకలు వేసింది. గమనించిన పక్కింటి వారు, బంధువులు వెంటనే గూడూరులోని సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే దస్రూ మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైద్యుడు.. కనిపించే దేవుడు



అలుపెరుగని సేవలకు సలాం..
నేడు డాక్టర్స్ డే

పాలకుర్తి టౌన్: వైద్యో నారాయణో హరి.. అనగా వైద్యుడు దేవుడితో సమానమని అర్థం. కనిపించే దేవుడు. రోగికి ప్రాణం పోసి నిండు జీవితం ప్రసాదిస్తాడు. రోగి పరేషాన్‌కు, ఏ ఆపరేషన్ చేయాలో అతడికే తెలుస్తుంది. నాడి పట్టి.. గుండె గుబుళ్లను గుర్తించి దిగులును దూరం చేసే కనిపించే దేవుడే వైద్యుడు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ ప్రమాదాల్లో పడిన జీవితాలకు పునర్జన్మ ఇస్తాడు. సోమవారం జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా వైద్యులపై 'సాక్షి' ప్రత్యేక కథనం..



సమాజంలో గుర్తింపు..

పవిత్రమైన వృత్తిలో ఉంటూ విశేష సేవలందిస్తున్న వైద్యులకు సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుంది. భయంకరమైన వ్యాధులు వచ్చిన వారి వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే భయపడుతుంటారు. అలాంటి రోగుల వద్దకు వెళ్లి ట్రీట్‌మెంట్ చేసేది కేవలం వైద్యులు మాత్రమే. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, చివరికి కూలీలకు కూడా సెలవులుంటాయేమో.. కానీ డాక్టర్లకు మాత్రం తీరికే ఉండదు. పిల్లాపాలతో గడిపేందుకు, కుటుంబ సభ్యులకు సమయం వెచ్చించేందుకు అవకాశాలు తక్కువే.

చేదు అనుభవాలు..

డాక్టర్లకు ఆదివారాలు లేవు. ఆనందాలు లేవు. ఎమర్జెన్సీ కేసు వచ్చిందంటే ఎక్కడున్నా సరే పరిగెత్తుకుంటూ వెళ్లాల్సిందే. రోగి ప్రాణాలను నిలబెట్టేందుకు వ్యక్తిగత జీవితాలు త్యాగం చేస్తుంటారు. అలాంటి వారు ఒక్కోసారి చేదు అనుభవాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆరోగ్య పరిస్థితి విషమించో... లేక మరే కారణాలతోనైనా రోగి మృతి చెందితే కుటుంబ సభ్యులు ఆందోళన చేయడం, దాడులకు దిగడం అక్కడక్కడ జరుగుతోంది. ఫలితంగా వైద్యుల సేవలకు, త్యాగాలకు గుర్తింపు లభించకుండా పోతోంది.

విస్తరిస్తున్న వైద్య సేవలు..

ఒకప్పుడు వైద్య సేవలు నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమయ్యేవి. కానీ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. కేవలం సాధారణ వైద్యులే కాకుండా వైద్య నిపుణులు సైతం మండల కేంద్రాలకు వచ్చి పనిచేస్తున్నారు. ముఖ్యంగా అన్నిరకాల ఆస్పత్రులు క్రమంగా విస్తరిస్తున్నాయి. హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన మల్టీస్పెషాలిటీ సేవలు నేడు గ్రామీణ చెంతకూ చేరాయి. ప్రభుత్వ ఆస్పత్రులు సైతం ఆధునికతను సంతరించుకుంటున్నాయి. మెరుగైన సేవలందిస్తూ డాక్టర్లు ప్రజామన్ననలు పొందుతున్నారు.


మానసిక ఒత్తిడి ఎక్కువే..

డాక్టర్లు వ్యక్తిగత జీవితాల్లో మానసిక ఒత్తిళ్లు ఎక్కువే ఉంటున్నాయి. వృత్తిలోని సాధకబాధకాలను అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో డాక్టర్లలో చాలాది అదే వృత్తిలో ఉన్నవారిని జీవిత భాగస్వామిగా ఎంచుకుంటారు. రోజుంతా రోగుల సేవలో కనిపించే వీరు వేడుకలు, పండుగల్లో కనిపించడం చాలా అరుదు. అన్నింటినీ త్యజించి వైద్య వృత్తిని ఎంచుకుంటారు. అందులో ఇబ్బందులైనా ఎదుర్కొంటారు. కానీ ఇతరులకు చెప్పరు. అలాంటి వైద్యులను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

డాక్టర్స్ డే నేపథ్యం

ప్రముఖ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బాదన్ చంద్రరామ్ పుట్టిన రోజునే దేశంలో డాక్టర్స్‌డేగా నిర్వహిస్తున్నారు. రాయ్ 1882 జూలై1 జన్మించారు. కలకత్తా మెడికల్ కాలేజీలో వైద్య డిగ్రీ పొందిన ఆయన.. లండన్‌లో ఉన్నత విద్యనభ్యసించి 1911లో స్వదేశానికి వచ్చి వైద్య సేవలు ప్రారంభించారు. కోల్‌కతా మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేశారు. మహాత్మాగాంధీతో కలిసి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. వైద్య వృత్తిలో విశేష సేవలు అందించిన ఆయన 1962 జూలై1వ తేదీనే కన్నుమూశారు. దీంతో ఆయన సేవలకు గుర్తింపుగా 1961 భారతరత్న అవార్డుతో సత్కరించిన ప్రభుత్వం.. బాదన్ చంద్రరామ్ జయంతి, వర్ధంతిని డాక్టర్స్‌డేగా జరుపుకోవాలని సూచించింది. అలా 1961 నుంచి మనదేశంలో జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

సైనికులు, ప్రజలకు సేవలందించడం అదృష్టం



ప్రపంచ వ్యాప్తంగా 6 దేశాల్లో, 15 రాష్ట్రాల్లో వెద్య సేవలు అందించా. దేశ రక్షణకు కృషి చేస్తున్న సైనికుల ప్రాణాలు కాపాడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్న. రెండేళ్ల పాటు ఐక్యరాజ్యసమితిలో, 6 నెలల పాటు నేపాల్ రాయబార కార్యాలయంలో పని చేశా. జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో జన్మించిన నాకు సైనికులకు వైద్య సేవలు అందించే అవకాశం దక్కడం ఎంతో భాగ్యం. ప్రస్తుతం జనగామ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న.

- మాచర్ల భిక్షపతి, రిటైర్డ్ కల్నల్, ప్రముఖ వైద్యుడు

వృత్తిలో తృప్తి



వైద్య వృత్తిలో తృప్తి లభిస్తుంది. రోగులకు వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నాం. ఇష్టంగా ఎంచుకున్న వృత్తిలో విజయాలు సాధించినప్పుడు కలిగే ఆనందం గొప్పది. ఒక్కోసారి కొనఊపిరితో వస్తుంటారు. ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రాణం పోతుంది. గ్రామీణ ప్రజలకు సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తాం.

-బుచ్చిరెడ్డి, ప్రముఖ వైద్యుడు, పాలకుర్తి

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- అవమానభారంతో పురుగుల మందుతాగిన దంపతులు..
- భార్య మృతి, చికిత్స పొందుతున్న భర్త.. పెద్దతండాలో ఘటన
- వివరాలు వెల్లడించిన ఎస్సై క్రాంతికిరణ్..


నీలమ్మ మృతదేహం

నెల్లికుదురు : వివాహేతర సంబంధం ఒకరి ప్రాణం తీసింది.. అవమానభారంతో పురుగుల మందు తాగిన దంపతుల్లో భార్య మృతి చెందగా భర్త చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం పెద్దతండాలో జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. పెద్దతండాకు చెందిన బానోత్ నీలమ్మ (36)కు అదే తండాకు చెందిన బానోత్ వీరన్నతో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ విషయంలో నీలమ్మ భర్త భద్రు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. వీరన్న మళ్లీ నీలమ్మ వద్దకు రావొద్దని పెద్దమనుషులు తీర్మానం చేశారు. అయినా వీరన్న మారకుండా ఈ నెల 29న రాత్రి నీలమ్మ ఇంటికి వెళ్లి బలవంతం చేయబోయాడు. దీంతో దంపతులు.. వీరన్నను బతిమిలాడి తమ పరువు తీయొద్దని ఎంత ప్రాధేయ పడినా వినలేదన్నారు. అంతేకాకుండా నీలమ్మతో తనకు వివాహేతర సంబంధం కొనసాగుతోందని తండాలో ప్రచారం చేస్తున్నాడు. దీంతో మనస్తాపం చెంది అవమాన భారం భరించలేక దంపతులు ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా నీలమ్మ మృతి చెందింది. భద్రును తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు బాదావత్ కిషన్ ఫిర్యాదు మేరకు బానోతు వీరన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

వినియోగదారుడిపై బంక్ యజమానుల దాడి


వినియోగదారుడిపై దాడి చేస్తున్న తండ్రీకొడుకు

రఘునాథపల్లి: డీజిల్ పోసుకుని ఇచ్చిన రూ. 500 నోటు చెల్లదని నెలకొన్న వివాదంలో ఓ వినియోగదారుడిపై పెట్రోల్‌బంక్ యజమానులైన తండ్రీకొడుకు దాడి చేసిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గండికోట శేఖర్ తన ట్రాక్టర్‌లో డీజిల్ కోసం బస్టాండ్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌కు వెళ్లాడు. రూ. 470 డీజిల్ పోసుకుని రూ. 500 నోటు ఇచ్చాడు. మిగతా రూ .30 ఇవ్వాలని శేఖర్ అడగగా రూ. 500 నోటు చెల్లదని బంక్ సిబ్బంది నిరాకరించారు. దీంతో బంక్ సిబ్బంది, శేఖర్ మధ్య వాగ్వాదం జరుగుతోంది. ఈ క్రమంలో సమీపంలో ఉన్న బంక్ యజమాని, రిటైర్డ్ డీఎస్పీ నర్సయ్య, అతడి కుమారుడు ఆగ్రహంతో ట్రాక్టర్‌పై ఉన్న శేఖర్‌పై దాడి చేశాడు. దాడి సమాచారం అందుకున్న శేఖర్ కుటుంబీకులు, స్థానికులు బంక్ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. పోలీసులు చేరుకుని దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాధితుడు శేఖర్ ఫిర్యాదు మేరకు బంక్ యజమానులు, రిటైర్డ్ డీఎస్పీ నర్సయ్య, అతడి కుమారుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

- యువకుడికి తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అభిలాష్

ఐనవోలు: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని వరంగల్–ఖమ్మం రహదారి పున్నేలు క్రాస్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మామిండ్ల అభిలాష్ తన చెల్లి సర్టిఫికెట్‌లు వారి బంధువులు పున్నేలు క్రాస్ వద్ద ఇస్తానని తెలుపడంతో తండ్రి మామిండ్ల తిరుపతి బైక్‌పై పున్నేలు క్రాస్ వద్దకు చేరుకున్నాడు. ఈ క్రమంలో వైజాగ్ నుంచి వరంగల్ మీదుగా రాజస్థాన్‌కు వెళ్తున్న లారీ.. డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంగా నడపడంతో అభిలాష్ నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టింది. కొద్ది దూరం ముందుకు అలాగే వెళ్లడంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. బైక్ పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రున్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, అభిలాష్‌ను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎడమ కాలు పూర్తిగా తొలగించడంతోపాటు పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. అభిలాష్ తాత రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

ఎంపీపీ తిరుపతిరెడ్డిపై ఛీటింగ్ కేసు

శాయంపేట : పట్టా పాస్ బుక్‌లో పేరు ఎక్కిస్తానని నమ్మబలికి రైతు వద్ద రూ.50వేలు తీసుకొని మోసం చేసిన శాయంపేట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డిపై బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఆదివారం ఛీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన చిలుకల కొమురయ్యకు నేరేడుపల్లె గ్రామ శివారులో 4ఎకరాల 32గుంటల భూమి ఉంది. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన పాస్‌బుక్‌లో కొమురయ్యకు 2ఎకరాల 12గుంటల భూమి మాత్రమే నమోదైంది. ఈ క్రమంలో కొమురయ్య తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అదే గ్రామానికి చెందిన ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డిని సంప్రదించగా రూ.50వేలు తనకు ఇస్తే పని అవుతుందని చెప్పాడు. దీంతో కొమురయ్య.. రూ.50వేలు అదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వేణు ద్వారా తిరుపతి రెడ్డికి ఇప్పించాడు. కాగా, డబ్బులు ఇచ్చి మూడు సంవత్సరాలు గడిచినా పనికాకపోవడంతో కొమురయ్య తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరాడు. అయినా ఇవ్వకపోవడంతో ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, పెద్దిరెడ్డి వేణులపై కొమురయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

కందిపప్పు, కారంపొడిపై చెక్ టెస్టులు


సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

వరంగల్: తెలంగాణలో ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కందిపప్పు, కారంపొడిలో కల్తీ జరుగుతున్నందున ఈనెల 3వ తేదీ నుంచి ఆహార కల్తీపై చైతన్య సదస్సులు, టెస్ట్ చెక్‌లు నిర్వహించేందుకు వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ తీర్మానం చేసిందని మండలి అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు. ఆదివారం వరంగల్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హానికరమైన కల్తీ వల్ల వినియోగదారులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కంది పప్పు ధర కిలో రూ.140నుంచి రూ.180వరకు అమ్మకాలు జరుగుతున్నందున కొందరు అధిక లాభార్జన కోసం కందిపప్పులో ఉత్తర భారతదేశంలో విరివిగా పండే బత్రి పప్పు, బఠాణీ పప్పులకు సింథటిక్ కలర్స్ వాడి కలుపుతున్నారని తెలిపారు. మహారాష్ట్రలోని ఇండోర్‌లో చౌకగా దొరికే బత్రి, బఠాణీ పప్పులను కలపడం వల్ల వ్యాపారస్తులకు అతిగా లాభం, వినియోగదారులకు హానికరమైన ఉదర కోశ వ్యాధులు సంక్రమిస్తున్నాయని అన్నారు. ఇటీవల హనుమకొండలో నిర్వహించిన టెస్ట్ చెక్‌లో వినియోగదారుల మండలికి అందిన ఫిర్యాదుల మేరకు, మండలి రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల చైతన్య కార్యక్రమాలు, టెస్ట్ చెక్‌లను నిర్వహించనున్నదన్నారు. అదే విధంగా వరంగల్, ఖమ్మం మార్కెట్‌ల నుంచి పెద్ద ఎత్తున సేకరించిన తాలు మిరప(తెల్ల మిరప)పొడికి సింథటిక్ కలర్స్, సూడాన్ వంటి హానికరమైన కలర్స్ కలపడం వల్ల వినియోగదారులు రోగాలకు గురవుతున్నారని అన్నారు. అనేక చోట్ల ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో కడుపునొప్పికి గురవుతున్న సంఘటనలు జరుగుతున్నాయని, దీనికి ఆహార కల్తీయే కారణమన్నారు. ఈసమావేశంలో సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళిచెర్ల సుదర్శన్, హైకోర్టు న్యాయవాది యశ్వంత్ కుమార్, జిల్లా కార్యదర్శులు రావుల రంజిత్‌కుమార్, అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడి భూమిని దున్నిన అన్నపై కేసు

శాయంపేట : తమ్ముడి భూమిని అక్రమంగా దున్నిన అన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని తహరాపూర్‌కు చెందిన లక్కర్సు మొగిలి, రమేశ్ అన్నదమ్ములు. వీరికి తల్లిదండ్రుల వారసత్వంగా చెరో ఎకరం 20గుంటల భూమి వచ్చింది. ఇందులో రమేశ్ తన వాటాను బిడ్డకు ఇచ్చుకొని తానే కౌలుకు సాగుచేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి మళ్లీ భూమి పంచాలంటూ రమేశ్.. మొగిలిని ఇబ్బందులకు గురిచేస్తుండగా భూమి పంచడం కుదరదంటూ మొగిలి చెప్పాడు. దీంతో రమేశ్ ఈ నెల 17న తమ్ముడి భూమిలో దున్ని పత్తి విత్తనాలు నాశనం చేశాడు. దీంతో మొగిలి ఫిర్యాదు మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన రమేశ్ మాట్లాడుతూ.. తన సోదరుడు ఫిర్యాదు చేశాడని స్టేషన్‌కు రప్పించిన ఎస్సై.. దుర్భాషలాడుతూ తనపై చేయిచేసుకున్నాడని చెప్పడం కొసమెరుపు.

వానొచ్చె.. చేప ఎదురొచ్చె..


గాలానికి చిక్కిన 10 కిలోల వాలుగలు

కొత్తగూడ: కొత్తగూడ ఏజెన్సీలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. కొత్త నీటి ప్రవాహానికి పాకాల సరస్సు నుంచి చేపలు ఎదురెక్కాయి. దీంతో కొత్తగూడ, గంగారం, ఖానాపూర్ మండలాల నుంచి చాలా మంది చేపల వేటకు వచ్చారు. ఒక్కో వాలుగ సుమారు 10 కిలోల పై ఉంది. భారీగా చేపలు పడుతుండడంతో సంతోషంగా వానొచ్చె వరదొచ్చె ఏలో.. కొత్త చాపలు ఎదురొచ్చె ఏలో అని పాడుకున్నారు.

గ్యాస్ లీక్.. పేలిన ఫ్రిడ్జ్

- నగదుతోపాటు సామగ్రి ధ్వంసం
- పెద్దతండాలో ఘటన


దగ్ధమైన వస్తువులు

దేవరుప్పుల : హైడ్రోకార్బన్ గ్యాస్ లీకై ఫ్రిడ్జ్ పేలింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు, నగదు దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం మండలంలోని పెద్దతండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన గుగులోత్ భాస్కర్ ఫ్రిడ్జ్‌లో హైడ్రోకార్బన్ గ్యాస్ లీక్ అయింది. దీంతో ఫ్రిడ్జ్ పేలింది. ఈ ఘటనలో ఇంట్లో సామగ్రి దగ్ధమవడమే గాక రేకులు పగుళ్లు పట్టాయి. ఇంటి నుంచి పొగలు రావడంతో పరిసర వాసులు గమనించి వెంటనే ఆర్పేశారు. ఈ ప్రమాదంలో ఇంటి సామగ్రితోపాటు కొంత నగదు, ఆహార వస్తువులు, దుస్తులు దగ్ధమైనట్లు గ్రామస్తుడు చంద్రభాను తెలిపారు.

పిల్లలతో సహా వివాహిత అదృశ్యం


శైలజ

చెన్నారావుపేట: భర్తతో గొడవపడిన వివాహిత పిల్లలతో సహా అదృశ్యమైంది. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జోజిపేట నారాయణ తండాలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన బానోతు శైలజ.. భర్తతో గొడవపడి శనివారం ఉదయం తన ఇద్దరు పిల్లలు వర్షిత, అభిషేక్‌ను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వివాహిత తండ్రి గుగులోత్ రంజ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.